# కొరింథీయులకు వ్రాసిన రెండవ పత్రిక 13వ అధ్యాయము

### పౌలు హెచ్చరికలు – తన ప్రయాణమును గూర్చిన సంగతులు

ఈ మూడవసారి నేను మీ యొద్దకు వచ్చుచున్నాను. ఇద్దరు ముగ్గురు సాక్షుల నోట ప్రతి మాటయు స్థిరపరచబడవలెను. 2 నేను మునుపు చెప్పితిని, నేనిప్పుడు మీ యొద్ద లేకున్నను రెండవసారి మీ యొద్ద ఉన్నట్టుగానే మునుపటి నుండి పాపము చేయుచున్న వారికిని, మిగిలిన వారికందరికిని ముందుగా తెలియజేయునదేమనగా, నేను తిరిగి వచ్చిన యెడల కనికరము చూపను. 3 క్రీస్తు నా యందు పలుకుచున్నాడని రుజువు కోరుచున్నారా? ఆయన మీ యెడల బలహీనుడు కాడు గాని, మీ యందు శక్తిమంతుడై యున్నాడు. 4 బలహీనతను బట్టి ఆయన సిలువ వేయబడెను గాని, దేవుని శక్తిని బట్టి జీవించుచున్నాడు. మేమును ఆయన యందుండి బలహీనులమై యున్నాము కాని మీ యెడల దేవుని శక్తిని బట్టి, ఆయనతో కూడా జీవము గలవారము. 5 మీరు విశ్వాసము గలవారై యున్నారో లేదో మిమ్మును మీరే శోధించుకొని చూచుకొనుడి మిమ్మును మీరే పరీక్షించుకొనుడి మీరు భ్రష్టులు కాని యెడల యేసుక్రీస్తు మీలో ఉన్నాడని మిమ్మును గూర్చి మీరే ఎరుగరా? 6 మేము భ్రష్టులము కామని మీరు తెలిసికొందురని నిరీక్షించుచున్నాను.

7 మీరు ఏ దుష్కార్యమైనను చేయకుండవలెనని దేవుని ప్రార్థించుచున్నాము మేము యోగ్యులమైనట్టు కనబడవలెనని కాదు గాని మేము భ్రష్టులమైనట్టు కనబడినను మీరు మేలైనదే చేయవలెనని ప్రార్థించుచున్నాము. 8 మేము సత్యమునకు విరోధముగా ఏమియు చేయనేరము గాని, సత్యము నిమిత్తమే సమస్తమును చేయుచున్నాము. 9 మేము బలహీనులమై యున్నను మీరు బలవంతులై యుండిన యెడల సంతోషించెదము. దీని నిమిత్తమే అనగా మీరు సంపూర్ణులు కావలెననియే ప్రార్థించుచున్నాము. 10 కాబట్టి నేను మీయొద్దకు వచ్చినప్పుడు పడద్రోయుటకు కాక, మిమ్మును కట్టుటకే ప్రభువు నాకనుగ్రహించిన అధికారము చొప్పున కాఠిన్యము కనపరచకుండునట్లు దూరముగా ఉండగానే ఈ సంగతులు వ్రాయుచున్నాను.

### ముగింపు మాటలు

11 తుదకు సహోదరులారా, సంతోషించుడి సంపూర్ణులై యుండుడి ఆదరణ కలిగి యుండుడి ఏక మనస్సు గలవారై యుండుడి సమాధానముగా ఉండుడి ప్రేమ సమాధానములకు కర్తయైన దేవుడు మీకు తోడైయుండును. 12 పవిత్రమైన ముద్దు పెట్టుకొని ఒకరికి ఒకరు వందనములు చేసికొనుడి 13 పరిశుద్ధులందరు మీకు వందనములు చెప్పుచున్నారు. 14 ప్రభువైన యేసుక్రీస్తు కృపయు దేవుని ప్రేమయు పరిశుద్ధాత్మ సహవాసమును మీకందరికిని తోడైయుండును గాక.

.